క్లుప్తంగా

క్యాడర్ మరింత సమాయత్తం కావాలి

- 5న వైఎస్సార్‌సీపీ భారీ బహిరంగ సభ
- నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త రాజారెడ్డి


రాజారెడ్డి

ఉదయగిరి: ఈ నెల 5న సాయంత్రం 3 గంటకు ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో వైఎస్సార్ సీపీ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి తెలిపారు. 2024 ఎన్నికలకు సంబంధించి పార్టీ క్యాడర్‌ను మరింత సమాయత్తం చేసేందుకు ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డితో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర పార్టీ పెద్దలు హాజరవుతారని తెలిపారు. ఈ సభకు నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యక ర్తలు, నామినేటెడ్ పదవులు పొందని వారు, పార్టీ పదవుల్లో ఉన్న వారితో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అచ్చమాంబకు పొంగళ్లు


విశేష అలంకరణలో అచ్చమాంబ పేరంటాలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువై ఉన్న అచ్చమాంబ పేరంటాళ్లకు పరిసర గ్రామాల మహిళలు ఆదివారం పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ పూజారి పొశర్లపూడి వెంకటేశ్వరశర్మ అభిషేకాలు, అర్చనలు, హారతులు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

రెండో రోజూ పింఛన్ల పంపిణీ

వింజమూరు (ఉదయగిరి): మండలంలోని పలు సచివాలయాల్లో ఆదివారం రెండో రోజూ వలంటీర్లు వివిధ రకాల పింఛన్లు లబ్ధిదార్లు ఉండే గ్రామాలకు వెళ్లి పంపిణీ చేశారు. రేపటిలోపు అన్నీ రకాల పింఛన్లు పంపణీ పూర్తి చేస్తామని 4వ సచివాలయ పంచాయతీ కార్యదర్శి మేడగం సందీస్‌కుమార్‌రెడ్డి చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం

దుత్తలూరు: స్థానిక సొసైటీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఎంపీపీ చేజర్ల జయంత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల వ్యూహా లు, పార్టీ కార్యక్రమాలు ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లడం, సంస్థాగతంగా పార్టీ బలోపేతం వంటి అంశాలు గురించి చర్చించారు. కార్యక్రమంలో జిల్లా సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ చలమారెడ్డి, కన్వీనర్ వాసుపల్లి వెంకటేశ్వరరెడ్డి, ఉండేల గురువారెడ్డి, సర్పంచ్‌లు షేక్ మస్తాన్‌బీ మీసాల సుబ్బారాయుడు, రామిరెడ్డి కొండారెడ్డి, టి.పెద వెంగ య్య, జి.సుజాత, ఉండేల నాగమ్మ, మండల ఉపాధ్యక్షురాలు ఎం .రమాదేవి తదితరులు ఉన్నారు.

ఘనంగా బీఎంఆర్ జన్మదిన వేడుకలు


కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

అల్లూరు: రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు 66వ జన్మదిన వేడుకలను ఆయన స్వగ్రామం అల్లూరు మండలం ఇస్కపల్లి పంచాయతీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. బీద మస్తాన్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత బీద రమేష్, ఎంపీపీ శిరేఖ, సర్పంచ్ రంజిత్, నాయకులు కొండూరు వాసు, శీనయ్య, మహిధర్, మునిరాజ్, సురేష్, వెంకయ్య, శ్రీహరి, ఇస్కపల్లి యూత్ తదితరులు పాల్గొన్నారు.

కొండేపి కాలువ కనుమరుగు



- ఈ ఫొటోలో ఉన్నది కావలి పట్టణ పరిధితో పాటు, మండలంలోని వ్యవసాయ భూముల్లోకి చేరిన అధిక వర్షపు నీరు, వరద నీరు ప్రవహించే వరద కాలువ. దీన్ని కొండేపి డ్రెయినేజీ కాలువ అంటారు. సుమారు 15,000 ఎకరాల్లో వరద నీరు చేరకుండా, పొలాలు ముంపునకు గురి కాకుండా వర్షపు నీరు కొండేపి డ్రెయినేజీ కాలువ ద్వారా చిప్పలేరుకు చేరుతోంది. సుమారు 20 అడుగుల వెడల్పు ఉండే ఈ కాలువ పట్టణ సమీపంలో ఉన్న ఆముదాలదిన్నె పంచాయతీ కొనదిన్నె వద్ద తుమ్మలపెంట రోడ్డును దాటుతోంది. రోడ్డు దాటేచోట రియల్ ఎస్టేట్ యజమాని కొంత పొలాన్ని కొనుగోలు చేశాడు. సదరు పొలంలో ఇంటి ప్లాట్లను సిద్ధం చేసి అమ్మకాలు చేయడానికి శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నాడు. పనిలో పనిగా కొండేపి డ్రెయినేజ్ కాలువను కూడా తన రియల్ ఎస్టేట్ చేసే భూమిలో కలిపేసుకుని గ్రావెల్ పోసి కాలువను పూడ్చేశాడు. ఇదెక్కడో కాదు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు నిత్యం రాకపోకలు సాగించే తుమ్మలపెంటరోడ్డు లోనే బాహాటంగానే కనిపిస్తోంది. అయినప్పటికీ అధికారులు తమకెందుకులే అనే ధోరణిని అవలంబిస్తుండడంతో రైతులకు ప్రాణప్రదమైన కొండేపి డ్రెయినేజ్ కాలువ మనుగడ ఆగమ్యగోచరమైంది.

రియల్ దందా

కావలి కేంద్రంగా చుట్టూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో శివారు భూముల విలువలకు రెక్కలొచ్చాయి. భవిష్యత్ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ భూములుగా మార్చేస్తున్నారు. అయితే నిబంధనల ప్రకారం వ్యవసాయ భూములను కమర్షియల్ భూములుగా మార్పు చేయాల్సి ఉంది. అందుకు భిన్నంగా అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తున్నారు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, నుడా అధికారులు మౌనంగా ఉన్నారు. మరో వైపు ఇరిగేషన్‌శాఖ చెందిన కాలువలను సైతం ఆక్రమించి పూడ్చేస్తున్నా.. ఆ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


కొండేపి కాలువను పూడ్చేసిన దృశ్యం

- 15 వేల ఎకరాల ముంపు కాలువను మింగేసిన వైనం
- రోడ్డును ఆనుకుని వ్యవసాయ భూమిని కమర్షియల్ స్థలంగా అమ్మకాలు
- ల్యాండ్ కన్వెర్షన్ చేయకుండా నిబంధనలకు తూట్లు
- మామూళ్ల మత్తులో ఇరిగేషన్, రెవెన్యూ, నుడా అధికారులు

కావలి: కావలి శివారు గ్రామాల్లో ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న పంట పొలాలు శరవేగంగా రియల్ ఎస్టేట్ లేఅవుట్లుగా మారిపోతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను సవాల్ చేస్తూ రియల్ ఎస్టేట్ నిర్వాహకులు బరితెగిస్తున్నారు. ప్రభుత్వ భూములను, పంట కాలువలను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. పొలాలను ముంచే కాలువలను మింగేస్తున్నారు. వ్యవసాయ భూములను నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నా.. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, నుడా శాఖల అధికారులు ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నాయి. ప్రధానంగా కావలి–తుమ్మలపెంట రోడ్డులో రియల్ ఎస్టేట్ లేఅవుట్లు ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటవుతున్నాయి. వ్యవసాయ భూముల్లో లేఅవుట్లుగా మార్పు చేసేందుకు కొందరు నిబంధనల ప్రకారం రెవెన్యూ, నుడా అనుమతులు తీసుకుంటున్నారు. మరి కొందరు ధనార్జనే ధ్యేయంగా అక్రమంగా లేఅవుట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటువంటి లేఅవుట్లపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, నుడా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. మరో వైపు రియల్ వ్యాపారులు పంట కాలువలు, పంట పొలాల డ్రెయినేజీ కాలువలను పూడ్చేస్తున్నా ఇరిగేషన్‌శాఖ అధికారులు మౌనంగా చూస్తున్నారు. ఆయా శాఖల అధికారులకు భారీగా ముడుపులు ముట్టడంతోనే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. సామాజికంగా విధ్వంసానికి పాల్పడుతూ ఈ దందారాయుళ్లు కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకి మాత్రం నామ మాత్రపు రుసుములు కూడా జమ చేయడం లేదు. నుడా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు చేతివాటం వల్లనే కావలి పట్టణాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో రియల్ ఎస్టేట్ దందాలు మితిమీరుతున్నాయి. పంట కాలువలను మాయం చేయడం నుంచి, కనీస నిబంధనలు కూడా పాటించకుండా విచ్చలవిడిగా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. రియల్ ఎస్టేట్ దందా నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఈ విషయమై కావలి ఇరిగేషన్ ఏఈ హరీష్‌ను ఫోన్లో సంప్రదించగా అన్ని అడిగి.. తాను కొత్తగా విధుల్లో వచ్చి చేరాను. కాలువ పూడ్చేసిన సంగతి, ఆక్రమణలు సంగతి తనకు తెలియదని చెబుతూ ఫోన్ కట్ చేశారు. పదే పదే ప్రయత్నించినా సమాధానం చెప్పడానికి నిరాకరించారు.

వ్యవసాయ భూమిలో లేఅవుట్



- ఈ ఫొటోలో కనిపిస్తున్న స్థలం కావలి పట్టణాన్ని ఆనుకుని ఉన్న ఆముదాలదిన్నె వద్ద తుమ్మలపెంటరోడ్డు పక్కనే ఉంది. రియల్‌ఎస్టేట్ యజమాని రైతు నుంచి పొలం కొనుగోలు చేసి ఆ పొలాన్ని లేఅవుట్‌గా మార్చేశాడు. ఇదొక అద్భుతమైన కమర్షియల్ స్థలంగా కోట్ల రూపాయలకు అమ్మకానికి పెట్టాడు. సాగు పొలాన్ని ఇంటి స్థలంగా, వ్యాపార స్థలంగా మార్పు చేయాలంటే రోడ్లు, బహిరంగ స్థలం వంటి కనీసం ప్రాథమిక నిబంధనలు అమలు పరచాలి. కాని తుమ్మలపెంట రోడ్డునే రోడ్డుగా చూపించి కమర్షియల్ స్థలంగా పొలాన్ని కోట్ల రూపాయాలకు అమ్మకానికి పెట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బరితెగింపుపై సంబంధిత శాఖల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

చెరువుల పటిష్టతపై ప్రత్యేక దృష్టి

- వర్షాలకు ముందే మరమ్మతులు
- వింజమూరు డీఈ రమణారావు


డీఈ రమణారావు

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో చెరువుల పటిష్టతకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అవసరం ఉన్న చెరువులకు మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపి నిధుల వచ్చిన వెంటనే పనులు చేపడతామని వింజమూరు ఇరిగేషన్ డీఈ టి.రమణారావు చెప్పారు. ఇటీవల డీఈగా బాధ్యతలు చేపట్టిన ఆయన సాక్షితో మాట్లాడారు. ప్రభుత్వం ఇరిగేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో సబ్ డివిజన్ స్థాయిలో రైతులకు ఆయకట్టు ద్వారా సజావుగా నీరు అందించేందుకు అన్నీ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రశ్న: వింజమూరు సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని చెరువులు ఉన్నాయి? ఆయకట్టు ఎంత?

జ: సబ్ డివిజన్ పరిధిలో 147 చెరువులు ఉన్నాయి. 19,659 ఎకరాల ఆయకట్టు ఉంది. వింజమూరు మండలంలో 32 చెరువులు, 5,129 ఎకరాల ఆయకట్టు, కొండాపురంలో 49 చెరువులు, 7,514 ఎకరాల ఆయకట్టు, దుత్తలూరులో 35 చెరువుల పరిధి లో 3,471 ఎకరాల ఆయకట్టు ఉంది. వరికుంటపాడులో 31 చెరువులు 3,545 ఎకరాల ఆయకట్టు ఉంది.

ప్రశ్న: సబ్ డిజిజన్‌లో మరమ్మతులు చేపట్టిన చెరువుల వివరాలు ఏమిటి?

జ: వింజమూరులోని యర్రబల్లిపాళెం చెరువుకు జైకా నిధులుతో పనులు జరుగుతున్నాయి. నక్కలగండి రిజర్వాయరులో షట్టర్లు లీకేజీ కాకుండా మరమ్మతులు చేపట్టాలి. మిగతా చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన వాటికి మరమ్మతులు కోసం ప్రతిపాదనలు పంపుతాం.

ప్రశ్న: చెరువుల్లో మట్టి అక్రమ తరలింపు, కర్రనరికివేత, చెరువుల ఆక్రమణపై ఎలాంటి చర్యలు ఉంటాయి?

జ: అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తాం. కర్ర తుమ్మ చెట్లు కూడా నిబంధనలకు వ్యతిరేకంగా నరికితే చర్యలు తీసుకుంటాం. ఇరిగేషన్ చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయి. ఎవరైనా చెరువు లోతట్టు ఆయకట్టును ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం. మా దృష్టికి తెస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: సబ్ డివిజన్‌లో ఏఈలు, సిబ్బంది పరిస్థితి ఏమిటి?

జ: సబ్ డివిజన్‌లో ఆరు సెక్షన్లు ఉన్నాయి. ఆరుగురు జేఈలు ఉండాలి. ప్రస్తుతం ముగ్గురు ఉన్నారు. మరో ఒకరు త్వరలో వస్తారు.మిగాతా వారిని కూడా త్వరలో నియమిస్తారు. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఖాళీల భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటాను.

ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం


ఆత్మకూరు డిపో ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక డిపో ఆవరణలోని ఆ సంఘ కార్యాలయంలో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ జి నారాయణరావు, రీజనల్ సెక్రటరీ ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శిగా మేకపాటి చిన్నారెడ్డి, అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫకీర్‌సా, కోశాధికారి ఎస్ఎస్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇతర యూనియన్ల నుంచి మరో 18 మంది నాయకులను ఎంప్లాయీస్ యూనియన్ సభ్యత్వం ఇచ్చి తమ యూనియన్‌లో చేర్చుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను యూనియన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి శ్యామ్యూల్‌బాబు, జోనల్ జాయింట్ సెక్రటరీ ఎన్వీ సుబ్బారావు, రీజనల్ నాయ కులు భాస్కర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, నరసింహారావు, సుబ్బరాయుడు, గణేష్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న సురక్ష కార్యక్రమం

బిట్రగుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కావలి డివిజన్ అభివృద్ధి అధికారిణి కనకదుర్గాభవానీ అన్నారు. మండలంలోని అల్లిమడుగు, ముంగమూరు, బిట్రగుంట సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని డీఎల్‌డీఓ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిట్రగుంట సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి కేటాయించిన మండల స్థాయి అధికారి గైర్హాజరు కావడంతో అసహనం వ్యక్తం చేశారు. అల్లిమడుగు వెల్ఫేర్ అసిస్టెంట్ కూడా కార్యక్రమానికి గైర్హాజరు కావడంతో షోకాజ్ నోటీసు జారీ చేయాల్సిందిగా ఎంపీడీఓ వెంకటసుబ్బారావుకు సూచించారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ప్రజలకు జవాబుదారీగా ఉండకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యానికి తావులేకుండా పని చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించేలా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అలక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు.

గురుపౌర్ణమికి ముమ్మర ఏర్పాట్లు


సంగం: పవిత్ర జలాలతో నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు: ఆషాఢమాస పౌర్ణమిని వ్యాస పౌర్ణమిగా, గురుపౌర్ణమిగా జరుపుకోవడం ఆనవాయితీ. సోమవారం పౌర్ణమి కావడంతో ఆత్మకూరులోని శివాలయ ప్రాంగణంలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరం, మెయిన్ బజారులోని సాయిబాబా మందిరంలో విశేష పూజలు, పల్లకి సేవ, భారీ స్థాయి అన్నదానాలు నిర్వహించనున్నారు. వేకువజాము నుంచే సాయిబాబా ఆలయంలో మూలవిరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, ఐదు రకాల హారతులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అభిషేకంలో భాగంగా స్వయంగా భక్తులతో సాయినాథుని విగ్రహానికి పాలాభిషేకం సామూహికంగా నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మెయిన్ బజారులోని సాయిబాబా మందిరాన్ని పూలతో అలంకరించనున్నట్లు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు, అఖండ సాయిబాబా భజన ఏర్పాటు చేసినట్లు మందిర నిర్వాహకులు పేర్కొన్నారు.

గురుపౌర్ణమి మహోత్సవాలు ప్రారంభం

సంగం: స్థానిక సాయినగర్‌లో కొలువైన సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సాయి భక్తులు పెన్నానది వద్దకు చేరుకుని పూజలు నిర్వహించి కలిశాల్లో పవిత్ర జలాలు తీసుకుని నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు

కలిగిరి: కలిగిరిలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి మహోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. సాయినాథున్ని ప్రత్యేకంగా అలంకరించారు. బాబాకు పాలాభిషేకం చేశారు. హారతి కార్యక్రమాలు కనుల పండగగా జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం మందిరం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


ఆత్మకూరులోని సాయిబాబా ఆలయం


సాయిబాబా ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ


కలిగిరిలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

9న ఎస్సీ వర్గీకరణ సాధన సమావేశం

ఉదయగిరి: హైదరాబాద్‌లో ఈ నెల మూడో వారంలో జరగనున్న ఎస్సీ వర్గీకరణ సాధన భారీ బహిరంగ సభ నేపథ్యంలో ఉదయగిరి నియోజకవర్గ సన్నాహక సమావేశం ఈ నెల 9 న గుండెమడగులలో జరుగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అదే రోజు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కూడా గుండెమడగులలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పంటల బీమా నిధులు మంజూరు

జలదంకి: గతేడాది ఖరీఫ్ సీజన్లో వర్షాలు, వరదలకు దెబ్బతిన్న వరి పంటకు సంబంధించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద జలదంకి మండలానికి బీమా నగదు మంజూరైనట్లు ఏఓ బి.శైలజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జలదంకి మండలంలో 359.07 ఎకరాలకు సంబంధించి 58 మంది రైతులకు రూ.78,97,573 మంజూరైనట్లు తెలిపారు. లబ్ధిదా రుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించామని, అభ్యంతరాలు ఉన్న రైతులు తెలియజేయాలని కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, సిబ్బంది

చేజర్ల: మండలంలోని మాముడూరులో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నెల్లూరుకు చెందిన రైట్స్, వసంత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంయుక్తంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీడియాట్రిక్ గర్భకోశ వ్యాధులు, డెంటిస్ట్, ఆర్థో, తదితర అనేక రకాల రోగాలకు ప్రముఖ వైద్యులు చైతన్య, సురేష్, విజయవేలాంగిని, మాల్యాద్రి, ఎన్.షహన, షావలిస్ తదితర డాక్టర్లు వైద్య సేవలు అందించారు. మాముడూరు, రెడ్డివారికండ్రిక, పెళ్లూరు తదితర గ్రామాలకు చెందిన సుమారు 200 మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, శిబిరం ఏర్పాటులో తన సహకారం అందించారు. సంస్థ సిబ్బంది సురేష్, సురేంద్ర పాల్గొన్నారు.

జ్ఞాపకాల దొంతరలు

- ఆనందాల అపూర్వ సమ్మేళనాలు
- ఏళ్ల తర్వాత కలుస్తున్న బాల్య మిత్రులు
- సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్న వైనం
- గెట్ టు గెదర్ సీజన్


వింజమూరులో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ఉదయగిరి: బడి ఒడిలో వదిలేసిన జ్ఞాపకం.. ఇప్పుడు గుండె గదిలో జ్ఞాపకమై చిగురిస్తోంది. కాలేజీ ఫేర్‌వెల్ నాడు ఆగిపోయిన స్నేహగీతం.. ఇన్నాళ్లకు కొత్త కోకిల రాగమై వినిపిస్తోంది. బాల్యం అందించిన ఆనందం.. ఇప్పుడు మళ్లీ కావాలనిపిస్తోంది. ఆ రోజుల పేజీలు వెనక్కి తిప్పాలనిపిస్తోంది. బడిలో పక్కన కూర్చున్న మిత్రుడు.. కాలేజీలో సైకిల్‌పై తోటిచ్చిన స్నేహితుడు.. చదువు చెప్పిన ఆయ్యోర్లను ఇంకోసారి చూడాలనిపిస్తోంది. 'సార్' అనే పలకరింపు అలవాటైన వారికి ఇప్పుడు 'అరేయ్' అనే పలకరింపును పరిచయం చేస్తోంది. కొత్త అనుబంధాల గజిబిజిలో పాత మిత్రులను కళ్ల ముందు కనిపించే ఆనందంలో అంతులేని ఆప్యాయతతో ఒళ్లంతా పులకరిస్తోంది. జిల్లాలో ఇప్పుడు అనేక ప్రాంతాల్లో 'గెట్ టు గెదర్' సీజన్ నడుస్తోంది. అప్పుడది తరగతి గది.. అలనాటి పాఠాలు.. ఆ రోజులు పంచిన జ్ఞాపకాల దొంతరలు కమ్మేస్తున్నాయి. కాలంతో పాటు పరుగులు పెడుతున్న వారు కాసేపు ఆగి బాల్యం గుర్తు చేసుకుంటున్నారు. కొందరు బడికి వెళ్లి ఆ నాడు తాను కూర్చున్న బల్ల, స్థలం, గోడలు, పరిసర ప్రాంతాలను తడిమి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటున్నారు. మరికొందరు కాలేజీలకు పోయి బెంచీలపై కూర్చొని సేద తీరుతున్నారు. జిల్లాలో ఎక్కడో ఒక చోట ప్రస్తుతం ప్రతి ఆదివారం గెటు టు గెదర్ కార్యక్రమాలు పూర్వ విద్యార్థులు అపూరూప సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. వింజమూరులో ఆదివారం యస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో చిన్ననాటి చిలిపి చేష్టలు, పాత జ్ఞాపకాలు, అలనాటి తీపి గుర్తులతో తడిసి ముద్దయింది. 1998, 2000 మధ్య నేతాజీలో చదివిన పూర్వ విద్యార్థులు కలిసి రోజంతా గత స్మృతులను నెమరవేసుకుంటూ పాతికేళ్ల వెనక్కివెళ్లిపోయారు.

తారతమ్యాలు మరిచి

స్కూలు, కాలేజీ రోజుల్లో దాదాపు అందురూ ఒకేలా ఉంటారు. కానీ రోజులు గడిచాక స్థాయిలు కూడా మారుతాయి. కొందరు 'పెద్దవాళ్లపోతారు' చాలా మంది 'చిన్నవాళ్ల'గానే మిగిలిపోతారు. ఆ తేడా పిలుపులోనూ కనిపిస్తోంది. కానీ ఇలాంటి అపూర్వ సమ్మేళనాలు ఆ తారతమ్యాలను దూరం చేస్తున్నాయి. చిన్నప్పుడు ఒకే కంచం పంచుకున్న మిత్రులు 'ఒరేయ్' అని పిలిస్తే ఎంతటి పెద్ద వారికైనా ఆనందంగానే అనిపిస్తోంది. సమాజంలో ఏ స్థాయిలో ఉన్నా.. ఎంత హోదా అనుభవిస్తున్నా.. మళ్లీ పాత మనిషిలా ఎలాంటి కల్మషం లేకుండా మారిపోవడం కపిపిస్తోంది. అదే బాల్య స్నేహం.. అపూర్వమైన బంధం.

సాటి వారికి సాయం

అపూర్వ సమ్మేళనాలు కేవలం ఆనందం కోసమే కాదు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కూడా ఉపయోగపడుతున్నాయి. చనిపోయిన మిత్రుల కుటుంబాలకు అండగా ఉండడం.. ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులను ఆదుకోవడం, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న స్నేహితుల పిల్లల చదువుకోసం ఆర్థిక సాయం చేస్తున్నారు. కష్టాల్లో ఉన్న స్నేహితులను ఆదుకోవడం వంటి వాటికి ఈ సమ్మేళనాలు వేదిక అవుతున్నాయి.

గుర్తుకొస్తున్నాయి..

ఒకప్పుడు స్కూల్ విడిచి పెట్టి వెళ్లాక స్కూల్ డేస్ అన్నీ మదిలోనే ఉండిపోయేవి. ఎప్పుడో.. ఎక్కడో.. క్లాస్‌మేట్ కనిపిస్తే ఆ జ్ఞాపకాలన్నీ మళ్లీ కళ్ల ముందు కనిపించేవి. సామాజిక మధ్యమాలు వచ్చాక పాత జ్ఞాపకాలు నెమరవేసుకోవడం సులువైంది. గ్రూపు ఏర్పాటు చేసుకోవడం.. ఫొటోలు షేర్ చేసుకోవడం.. పాత స్నేహితులను పలకరించుకోవడం ఇప్పుడు నిత్యకృత్యమైంది. ఆ ముచ్చట్లను సెల్‌ఫోన్లకు పరిమితం చేయకుండా చాలా మంది పూర్వ విద్యార్థులు మళ్లీ స్కూళ్లకు వెళ్లి కలుసుకుంటున్నారు. పాత జ్ఞాపకాల సందడితో ఆ రోజు అంతా ఎంజాయ్ చేస్తున్నారు. అందరికి అనువైన రోజును నిర్ణయించుకొని అప్పటి గురువులను సన్మానించుకుంటున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

- తప్పిన పెను ప్రమాదం


కాలువలో పడిన కారు

చేజర్ల (సోమశిల): ఓ కారు సోమశిల ఉత్తర కాలువలోకి దూసుకెళ్లిన ఘటన ఆదివారం జరిగింది. స్థానిక పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన శ్రీనివాస్, సూర్య, మాధవ్, అలేఖ్య, భాగ్యలక్ష్మి తిరుమల దైవదర్శనానికి కారులో బయలుదేరారు. అనంతసాగరం మండలం పాతాళపల్లి వద్దకు వచ్చే సరికి కారు అదుపు తప్పి సోమశిల ఉత్తర కాలువలోకి దూసుకెళ్లింది. అయితే ఆ సమయంలో కారులో ఉన్న ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కారు బాగా దెబ్బతింది. క్షతగాత్రులను 108లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. స్థానికుల సహాయంతో సోమశిల ప్రాజెక్ట్ పోలీసులు కారును వెలికి తీశారు.